క్లుప్తంగా

సబ్‌కోర్టు తాత్కాలిక తరలింపు

నేటి నుంచి మున్సిపల్ కల్యాణ మండపంలో కొనసాగింపు

యానాం: యానాం సబ్‌కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో న్యాయశాఖ ఆదేశాల మేరకు తాత్కాలికంగా స్థానిక కామిశెట్టి వీధిలోని మున్సిపల్ కల్యాణ మండపానికి తరలిస్తున్నారు. వందల ఏళ్ల క్రితం ఫ్రెంచి హయాంలో నిర్మాణం చేసిన యానాం సబ్ కోర్టు భవనం శ్లాబు పెచ్చులూడటంతో పాటు వర్షపునీరు కారుతుండటంతో ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల యానాం వచ్చిన న్యాయశాఖ కార్యదర్శి కోర్టు భవనాన్ని మార్పు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కల్యాణ మండపాన్ని సైతం పరిశీలించి ఆమోదాన్ని తెలిపారు. సోమవారం నుంచి మున్సిపల్ కల్యాణ మండపంలో కోర్టు కార్యకలాపాలు జరగనున్నవని ఈ మార్పును ప్రజలు గ్రహించాలని బార్ అధ్యక్షుడు కె విజయకుమార్ కోరారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపిక

యానాం: విద్యుత్ సంరక్షణపై అవగాహన ప్రచారంలో భాగంగా భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గతనెల ఆన్‌లైన్ మాధ్యమంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో యానాం నవోదయ విద్యార్థిని రితిక యానాం రీజినల్ స్థాయిలో ప్రోత్సాహక నగదు బహుమతి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. నవోదయ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రితిక ఈనెల 26న పుదుచ్చేరిలో జరిగే రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థిని రితికను ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రైయిన్లలో పూడిక తొలగించాలి



వెంకట్‌నగర్‌లో డ్రైయినేజీ పరిశీలిస్తున్న నాయకులు

యానాం: యానాం పట్టణ పరిధిలోని డ్రైయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి దుర్గాప్రసాద్, వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానిక వెంకట్‌నగర్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతంలో డ్రైయినేజీపై సిమెంట్ బల్లలు తీసి శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులను కోరారు. డ్రైయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండిపోవడం వల్ల మురుగునీరు ప్రవహించడం లేదన్నారు. తక్షణం సిమెంట్ బల్లలు కింద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఐ పోలవరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ముమ్మిడివరం గ్రంథాలయశాఖలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎస్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

సమాజంలో మీడియా పాత్ర కీలకం



సదస్సులో మాట్లాడుతున్న రాజయోగిని రమాదేవి

అమలాపురం టౌన్: సమాజంలో మీడియా పాత్ర కీలకమని విశాఖపట్నం నుంచి వచ్చిన రాజయోగిని బ్రహ్మకుమారి రమాదేవి అన్నారు. స్థానిక శివాలయం రోడ్డులో గల ఓం శాంతి కేంద్ర భవనంలో కోనసీమ మీడియా ప్రతినిధులతో ఆదివారం జరిగిన ఆత్మిక స్నేహ మిలన్ సదస్సులో ఆమె ఉపన్యసించారు. అమలాపురం ఓ శాంతి కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో 'సమాజంలో మీడియా పాత్ర-ఆధ్యాత్మికంగా అందిస్తున్న సేవలు' అనే అంశంపై ఆమె మాట్లాడారు. వృత్తి పరమైన ఒత్తిళ్లతో ఉండే మీడియా ప్రతినిధులు ధ్యానం, భగవతారాధన విధిగా చేయాలన్నారు. అనంతరం మీడియా ప్రతినిధుల చేత కాసేపు ధ్యానం నిర్వహించారు.

పి.మల్లవరం సర్పంచ్ సత్యనారాయణ మృతి

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ సర్పంచ్ దున్నా సత్యనారాయణ ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ప్రస్తుతం మండల టీడీపీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయన మృతికి ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిక్కపూడి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆదాయం అల్పం.. అభివృద్ధి శూన్యం

- మున్సిపాలిటీలో మందకొడిగా పన్నుల వసూళ్లు
- గుదిబండగా మారిన ప్రభుత్వ భవనాల బకాయిలు
- ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నా వసూలు 31.52 శాతమే
- పట్టణాభివృద్ధికి ఆటంకం



అమలాపురం మున్సిపల్ కార్యాలయ భవనం



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పన్నులు వసూలు చేస్తున్న ఆర్వో శ్రీలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పన్నుల నుంచి వచ్చే ఆదాయం తగ్గి పట్టణాభివృద్ధి వెనుకబడుతోంది. చెల్లింపుదారులు సక్రమంగా చెల్లించకపోవడంతో పన్నుల బకాయిల భారం తడిసి మోపెడవుతోంది. ఈ ప్రభావం పట్టణాభివృద్ధిపై తీవ్రంగా పడుతోంది. ఇటీవల అమలాపురంలో మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జిల్లాలోని మున్సిపాలిటీ కమిషనర్లతో పన్నుల వసూళ్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పట్టణం పన్నుల వసూళ్ల పరంగా జిల్లాలోనే వెనుకబడి ఉందని స్పష్టం చేసిన పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకూ ఉన్న ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొన్ని నెలలు మాత్రమే ఉన్నా ఇప్పటి దాకా పట్టణంలో పన్నుల వసూళ్ల శాతం 31.52 శాతమే ఉంది. పట్టణం మొత్తం మీద రూ.14.62 కోట్ల పన్నుల వసూళ్ల డిమాండ్ అయితే ఇప్పటి వరకూ రూ.4.60 కోట్లు మాత్రమే వసూలైంది.

ప్రభుత్వ భవనాలే అసలు సమస్య

పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు 2016 నుంచి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. పట్టణంలో ఉన్న 57 ప్రభుత్వ భవనాలకు గాను 7 భవనాల నుంచి పన్నులు సక్రమంగానే వసూలవుతున్నా మిగిలిన 50 భవనాల తాలూకా బకాయిల భారం రూ.48.87 కోట్లు చేరిన పరిణామాలు మున్సిపల్, రెవెన్యూ విభాగాన్ని ఆలోచనలో పడేసింది. దీనికి తోడు 2022లో అమలాపురం పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో మరికొన్ని జిల్లా స్థాయి కార్యాలయాలు పట్టణంలో ఏర్పడ్డాయి. ఉదాహరణకు గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్న మహిళా సాధికారిత భవనాల సముదాయం నేడు కలెక్టరేట్‌గా మారింది. ఈ భవనాల సముదాయం పన్ను బకాయి రూ.44 లక్షలకు పైమాటే. ఇక పట్టణంలో పోలీసు క్వార్టర్స్ పన్నుల బకాయిలు రూ.58 లక్షలకు చేరుకుని పట్టణంలో అతి భారీ బకాయిగా నిలిచింది. ఇలా పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల పన్నుల బకాయిలను పరిశీలిస్తే రూ.లక్ష నుంచి రూ.50 లక్షలకు పైగానే పేరుకు పోయాయి. పన్నుల బకాయిలు పడ్డ ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లు, భవనాల యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు. చెల్లించని వారికి బకాయి మొత్తంలో నూటికి నెలకు 2 శాతం అపరాధ రుసంతో వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో ప్రత్యేక దృష్టి

భారీగా పేరుకు పోయిన పన్నుల వసూళ్లకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, మున్సిపల్ రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో రెండు వారాలుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలోకి అంటే ఇళ్లు, భవన యజమానులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజుదారుల వద్దకు నేరుగా వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ అధికారుల బృందం ఇటీవల పట్టణంలోని కలెక్టరేట్‌కు వెళ్లి గతంలోని డీఆర్‌డీఏ భవనాలు, ప్రస్తుత కలెక్టరేట్‌కు సంబంధించి పేరుకుపోయిన రూ.44 లక్షల బకాయి పన్నులను చెల్లించాలని కలెక్టరేట్ ఏవోను అభ్యర్థించారు. అలాగే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి 104 షాపులు ఉన్నాయి. వీటి ద్వారా నాన్ టాక్సెస్ కింద రూ.26 లక్షల వరకూ పెండింగ్ అద్దెల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఈ షాపుల లీజుదారుల వద్దకు స్వయంగా వెళ్లి అద్దెలు చెల్లింపుపై ఒత్తిడి తెస్తున్నారు. బకాయి అద్దెలు చెల్లించని వారి షాపులను సీజ్ చేశారు కూడా. గత రెండు వారాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా దాదాపు రూ.30 లక్షల వరకూ వసూలు చేశారు.

భారీ బకాయిల ప్రభుత్వ కార్యాలయాలు ఇవే

పోలీస్ క్వార్టర్స్ భవనాల సముదాయం	రూ.55 లక్షలు
డీఆర్‌డీఏ భవనాలు (కలెక్టరేట్)	రూ.44 లక్షలు
ఆర్డీవో కార్యాలయ భవనం	రూ.33 లక్షలు
తహసీల్దార్ కార్యాలయ భవనం	రూ.27 లక్షలు
అంబేద్కర్ కమ్యూనిటీ హాలు భవనం	రూ.23 లక్షలు
ట్రావెలింగ్ బంగ్లా (జిల్లా పరిషత్)	రూ.18 లక్షలు
ఉమెన్ ట్రైనింగ్ సెంటర్	రూ.17 లక్షలు
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	రూ.12 లక్షలు
సర్దార్ కాటన్ గెస్ట్ హౌస్	రూ. 12 లక్షలు
జెడ్పీ హైస్కూలు షాపింగ్ కాంప్లెక్స్	రూ.11 లక్షలు

నూరు శాతం వసూలు చేస్తాం

పట్టణంలో బకాయి పన్నులతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నులను మార్చి 31 నాటికి నూరు శాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో మా రెవెన్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. కమిషనర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌తో వసూళ్ల శాతం క్రమేపీ పెరుగుతోంది. నూరు శాతం పన్నుల వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. 95 శాతం పన్నుల వసూలు చేసి తీరతాం. ఇంకా ఉన్న నాలుగు నెలల గడువును వసూళ్లకు పూర్తిగా ఉపయోగించుకుంటాం. పన్నుల బకాయిల భారం తీరితే మున్సిపాలిటీకి ఆర్థికంగా ఉపశమనం కలుగుతుంది.

– భూపతి శ్రీలక్ష్మి, రెవెన్యూ అధికారి, అమలాపురం మున్సిపాలిటీ.

అలరించిన కవి సమ్మేళనం



సత్కారం అందుకున్న కవులతో గ్రంథాలయాధికారి వర్మ, పాఠకులు

అమలాపుం టౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం పాఠకులను అలరించింది. కవి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో పలువురు కవులు గ్రంథాలయ విశిష్టతను తమ కవితా గానాల ద్వారా వినిపించారు. అంతర్జాతీయ సాహిత్య సేవాసంస్థ, శ్రీశ్రీ కళావేదిక జిల్లాశాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. కవులు రాసే కవితలు, కావ్యాలు, గ్రంథాలు సామాజిక స్పృహతో ఉండి అవి సమాజ వికాసానికి చేయూత నివ్వాలని కవి బీవీవీ సత్యనారాయణ ఆకాంక్షించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి గ్రంథాలయాలు, బాల కార్మికుల గురించి కవితా గానాన్ని వినిపించారు. కవులు బాలార్జున సత్యనారాయణ మాకే, కడలి సత్యనారాయణ, టి.వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీ శరత్‌బాబు, రాయుడు త్రినాథరావులు తమ కవితా గానాలు వినిపించి సమాజంలో గ్రంథాలయాల పాత్రను వివరించారు. గ్రంథాలయాధికారి శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను గ్రంథాలయం తరఫున ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ సహాయకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవాని తదితరులు పాల్గొన్నారు.

యానాం అభ్యర్థులకు 8న కాంపిటెన్సీ పరీక్ష

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపక దళంలో ఫైర్‌మెన్ డ్రైవర్ గ్రేడ్-3 పోస్టులకు సంబంధించి శారీరక దారుఢ్య పరీక్ష ఉత్తీర్ణులైన యానాం అభ్యర్థులకు డిసెంబర్ 8న కాంపిటెన్సీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆదివారం పుదుచ్చేరి డివిజినల్ ఫైర్ ఆఫీసర్ కె ఇలంగో ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రీజియన్‌ల పరిధిలో ఈనెల 23నుంచి డిసెంబర్ 8 వరకు రోజుకు 45 మంది చొప్పున మొత్తం 260 మంది అభ్యర్థులకు పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు ఇచ్చిన నిబంధనావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు.

కోనసీమ క్షత్రియ సంఘీయుల సంక్షేమానికి కృషి

కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ



మంత్రి శ్రీనివాసవర్మ దంపతులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

అమలాపురం రూరల్: కోనసీమ క్షత్రియ సేవా సమితి సంఘం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. అమలాపురం కొంకాపల్లిలో కోనసీమ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో కోనసీమ క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ప్రసంగించారు. రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర విప్ దాట్ల సుబ్బరాజులు మాట్లాడుతూ క్షత్రియులు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. మాజీ శాసన మండలి సభ్యులు కెవీవీ సత్యనారాయణ రాజు, రుద్రరాజు పద్మరాజు, సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, సమితి అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు, కార్యదర్శి పి.వెంకటపతి రాజు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు.. ఆదర్శనీయులు



శ్రీకామాక్షీదేవి ట్రస్టుకు నిత్యావసరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్: వారంతా అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1974వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థులు. ఓ వాట్సాప్ గ్రూపు రూపొందించుకుని దానిద్వారా విరాళాలు సమకూర్చుకుని పలు వితరణ కార్యక్రమాలు చేపట్టడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. ఆ వాట్సాప్ గ్రూపు రూపొందించి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు అమలాపురంలో ఆదివారం కలుసుకుని వివిధ సంస్థలకు తమ విరాళాలు అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. పూర్వపు విద్యార్థులు డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ దుంగా వెంకట్, ఇష్టా రామగోపాలం, కర్రా రామకృష్ణ, పెమ్మరాపు విజయ్, మంగిపూడి ప్రసాద్, పి.రమణ, జి.శివకుమార్, పేరి శ్రీనివాస్, నూకల కామేశ్వరరావు, మంథా లక్ష్మీదేవి తదితరులు ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయండి

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్‌కు వినతి

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో కార్మికులకు రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు అమలు జరగలేదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రా ఆటోవాలా కార్మికులు విన్నవించారు. కోనసీమ జిల్లా ఆంధ్రా ఆటోవాలా, అమలాపురం శ్రీదుర్గా హనుమాన్ సెంటర్ ఆటో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన బండారులంక లెక్కింశెట్టి వారి తోటలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. ఆటో కార్మికులు కుటుంబాలతో పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో సమాజాభివృద్ధి



శిక్షణ పొందిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందిస్తున్న పెద్దాపురం సీఐ అంకబాబు

అమలాపురం టౌన్: వ్యక్తిత్వ వికాసమే సమాజ వికాసంగా విరాజిల్లుతుందని వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు గొవ్వాల నాగరాజు అన్నారు. ఈ సేవాసమితి, ఏబీవీపీ, నేదునూరు వివేకానంద యువత సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో వ్యక్తిత్వ వికాసంపై ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. యువతలో వివేకానందుని స్ఫూర్తిని నింపేందుకు ఈ శిక్షణా తరగతులు తోడ్పడతాయన్నారు. 2025 జనవరి 12న జరిగే స్వామి వివేకానంద జయంతి నాటికి కోనసీమ వ్యాప్తంగా సుమారు వంద మంది వ్యక్తులను ఆ దిశగా శిక్షణ ఇచ్చి తయారు చేయడమే తమ సమితి లక్ష్యమని నాగరాజు తెలిపారు. వ్యాపారవేత్త పి.రవికుమార్, సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావులు అతిథులుగా పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, వ్యాఖ్యాత, జర్నలిస్ట్ ఆకుల రవితేజ, ఆకొండి సింహాచలం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్, డాక్టర్ కొప్పిసెట్టి రమణకుమార్, ఎస్ఎండీసీ సీజీఎం శేఖర్‌లు విద్యార్థులకు యూత్ లీడర్ షిప్, స్కిల్ డెవలప్‌మెంట్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు అంజిని శ్రీనివాస్ శిక్షణ పొందిన విద్యార్థులకు నైతిక విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో పెద్దాపురం సీఐ ఆర్.అంకబాబు, ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి నాగ సుధాకొండ, సంస్కార భారతి ప్రతినిధి పేరి లక్ష్మీ నరసింహం, నేదునూరు వివేకానంద, యువత, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో గౌడ కార్తిక వనసమారాధన



2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడసంఘం నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ గౌడసంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామపురం శివారులో గౌడ కార్తిక వనసమారాధన ఆత్మీయ వాతావరణంలో ఆదివారం జరిగింది. పట్టణ గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మట్ట రవికిషోర్, దాసర శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనసమారాధన వేడుకలు జరిగాయి. కోనసీమ వ్యాప్తంగా గౌడ సామాజిక వర్గీయులు కుటుంబ సమేతంగా విచ్చేసి వన సమారాధనలో సందడి చేశారు. వేడుకకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మ్యూజికల్ చైర్స్, లక్కీ ఫ్యామిలీ, వెల్ బేబీషో, ఫ్యాన్సీ డ్రెస్‌ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని కేరింతలు కొట్టారు. గౌడ సామాజిక పెద్దలు మాట్లాడుతూ గౌడలంతా అన్ని విషయాల్లో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ముందుగా ముద్రించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం గౌరవాధ్యక్షుడు వీరిన సాయిరామ్, సమన్వయ అధ్యక్షుడు వెలిగట్ల జగదీష్, ఆర్థిక కార్యదర్శి అయినవిల్లి నాగేంద్రకుమార్, మాజీ కౌన్సిలర్ వెలిగట్ల రామలక్ష్మణరావు, సర్పంచ్ రాజులపూడి భీముడు, స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. సంఘ పెద్దలు విజేతలకు బహుమతులు అందజేశారు.

21న జాతీయస్థాయి విద్యాసదస్సు

యానాం: పుదుచ్చేరిలో ఈనెల 21న మొట్టమొదటి జాతీయ విద్యా సదస్సును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక విద్య, సంస్కృతి తదితర అంశాలను ఈ జాతీయ స్థాయి సదస్సులో చర్చిస్తారన్నారు. ఆరోజు సాయంత్రం ర్యాలీని నిర్వహిస్తారని చెప్పారు. బోధనా విధానంలో మార్పుల ద్వారా విద్యార్థుల్లో జ్ఞానసంపదను పెంపొందించడం వంటి అంశాలపై వక్తల ప్రసంగాలు ఉంటాయన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యదర్శి అతుల్ కొఠారి, ఎల్జీ కె కైలాషనాథన్, సీఎం రంగసామి, స్పీకర్ ఆర్ సెల్వం తదితరులు పాల్గొంటారన్నారు.

సమాజ చైతన్యమే విశ్వజన కళామండలి లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వజన కళా మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మాస్టార్జీ

అమలాపురం టౌన్: కళాకారులు, గాయకులతో విశ్వజన కళామండలి సమాజాన్ని చైతన్య పరుస్తోందని ఆ మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మాస్టార్జీ అన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల షైనీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన విశ్వజన కళామండలి సమావేశంలో డాక్టర్ మాస్టార్జీ మాట్లాడారు. డిసెంబర్ 10న మండలి 46వ వార్షికోత్సవ వేడుకలను విజయవాడలో వారం రోజుల పాటు నిర్వహించాలని సమావేశం తీర్మానించి ఆమోదించింది. సమావేశానికి ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విశ్వజన కళామండలి మేధావులు, కళాకారులు, గాయకులు పాల్గొని వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. రాష్ట్ర మండలి అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు ఎడ్ల సురేష్‌కుమార్, మండలి కేంద్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మేకల మీరాసాహెబ్, జిల్లా అధ్యక్షుడు గెద్దం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు, గాయని పల్లేటి సుశీల తదితరులు ప్రసంగించారు.

నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ముఠా అరెస్టు

పరవాడ (విశాఖ జిల్లా): లంకెలపాలెం ప్రాంతంలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నలుగుర్ని పరవాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అనకాపల్లి మండలం విజయరామరాజపేటకు చెందిన ఓమ్మి భానుప్రకాష్, వై.ఆదర్శ్, పెదరెల్లి వీధికి చెందిన పాట్నూరు హరిచంద్రప్రసాద్, విజయనగరం జిల్లా రాజాం మండలం బురడ గ్రామానికి చెందిన తీగల క్రాంతికుమార్‌లను అరెస్టు చేశారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం గ్రామానికి చెందిన గుత్తుల విశాల్, అతని మామయ్య శీలం శ్రీనుతో కలిసి ఈ నెల 16న టాటా ఏసీ వ్యానులో కొబ్బరి బొండాల లోడు తీసుకొని విశాఖలోని ఎస్ఏడీ కొత్త రోడ్డులో ఆదివారం వేకువజామున 3.30 గంటలకు అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం కూడలిలో టీ తాగేందుకు మధ్యాహ్నం ఆగారు. ఆ సమయంలో అక్కడికి పై నలుగురు వచ్చి రూ.500 నోటుకు చిల్లర అడిగారు. సదరు వ్యక్తులు ఇచ్చిన నకిలీ ఐదు వందల నోటుకు చిల్లర ఇచ్చారు. అదే అదనుగా భావించిన సదరు వ్యక్తులు మళ్లీ మరో నాలుగు నకిలీ రూ.500 నోట్లు ఇచ్చి చిల్లర ఇవ్వమని కోరగా వాటికి కూడా విశాల్ చిల్లర ఇచ్చాడు. చిల్లర తీసుకొని ఆ నలుగురు అక్కడి నుంచి జారుకున్నారు.

అనంతరం విశాల్ తన దగ్గరున్న నోట్లను పరిశీలించగా అవి నకిలీ నోట్లుగా కనిపించాయి. ఆ నోట్లపై చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉందని గుర్తించి పరవాడ పోలీసులను ఆశ్రయించారు. నకిలీ నోట్ల చలామణిపై విశాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నలుగురు ముఠా సభ్యులను మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఐ పోలవరం: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం స్థానిక ముమ్మిడివరం సీఐటీయూ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి దుర్గాప్రసాద్‌లు మాట్లాడారు. ఆ రోజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా ఉంటుందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, బలహీన వర్గాలపై పన్నుల భారాన్ని మోపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు కవిత్వం, మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలని శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో ఆదివారం విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్, అద్దంకి అమరేశ్వరరావు, చిక్కం ప్రసాద్, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

యానాం: 216 యానాం-కాకినాడ జాతీయ రహదారిలో పి మల్లవరం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్సై పి సత్యనారాయణ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ డ్రైవ్‌ను నిర్వహించినట్లు చెప్పారు. నిందితులను కాకినాడ రెండవ తరగతి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.